క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 26న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. గోపాల్‌పూర్, ద్వారకసాయి కాలనీ, నవయుగ కాలనీ, జవహర్ కాలనీ, మారుతీనగర్, ఎస్‌వీఎస్ హోమ్స్, ఉషోదయ కాలనీ, ఎన్జీవోస్ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 10నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు, న్యూశాయంపేట, మోక్ష విల్లాస్, విశాల్ మార్ట్, త్రివీ స్కూల్, శ్రీచైతన్య స్కూల్, సాయినగర్ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 10నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఢిల్లీకి బయల్దేరిన మేయర్

వరంగల్ అర్బన్: ఢిల్లీలో ఈనెల 26న జరగనున్న 16వ ఆర్థిక సంఘం సమావేశానికి వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి హాజరు కానున్నారు. ఆర్థిక సంఘం ఉన్నతాధికారుల ఆహ్వానం మేరకు ఆమె సోమవారం బయలుదేరి వెళ్లారు.

నియామకం, ఎన్నిక



వరంగల్ లీగల్: హనుమకొండ జిల్లా ఆర్యవైశ్య చార్టెడ్ వైస్ ప్రెసిడెంట్‌గా సీనియర్ న్యాయవాది తాటికొండ కృష్ణమూర్తి నియమితులయ్యారు. ఈమేరకు సోమవారం జరిగిన ప్రమాణస్వీకారం వేడుకల్లో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా మాచర్ల రాంబాబు



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ విభాగం పరిశోధక విద్యార్థి మాచర్ల రాంబాబును ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా నియమించినట్లు ఏబీవీపీ జాతీయ అధ్యక్షుడు రాజ్‌శరణ్ సోమవారం తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లో జరుగుతున్న జాతీయ మహాసభల్లో రాంబాబును జాతీయ కార్యవర్గ సభ్యుడిగా నియమించారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం మర్రిపెల్లిగూడెంకు చెందిన రాంబాబు.. 2016 నుంచి ఏబీవీపీలో పనిచేస్తున్నారు.

బీసీటీఏ జిల్లా కార్యవర్గం ఎన్నిక

ఖిలా వరంగల్: బీసీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు, జేఏసీటీఏ సెక్రటరీ జనరల్ కృష్ణుడు అధ్యక్షతన జరిగిన వరంగల్ అండర్ రైల్వేగేట్ ప్రాంతంలో సోమవారం జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎనుకున్నారు. అధ్యక్షుడిగా కాసుల శైలేంద్రకుమార్, ప్రధాన కార్యదర్శిగా కొలిపాక కృష్ణ, కోశాధికారిగా సమ్మయ్య, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ టి.తిరుపతి ఎన్నికయ్యారు.

ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడిగా వెనిశెట్టి రఘు



కాజీపేట: ఆర్యవైశ్య మహాసభ హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా వెనిశెట్టి రఘు నియమితులయ్యారు. ఈమేరకు ఆయనకు ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ సోమవారం నియామక పత్రం అందజేశారు.

వెయిట్ లిఫ్టర్‌కు సన్మానం



న్యూశాయంపేట / ఖిలా వరంగల్ : తెలంగాణ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో వరంగల్ దూపకుంట రోడ్డు శంభునిపేట, వరంగల్ (జీ2) మైనారిటీ బాలికల గురుకులం విద్యార్థి రుబియా అండర్ -19 వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించింది. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈమేరకు రుబియాను ప్రిన్సిపాల్ టి.నీలిమాదేవితో పాటు అధ్యాపకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

పలువురికి జరిమానాలు

రామన్నపేట: వరంగల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో లైసెన్స్ లేకుండా వాహనం నడుపుతూ పట్టుబడిన నలుగురు వాహనదారులకు వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ అబ్బోజు వెంకటేశం.. రూ.4,500 వేల జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు వెల్లడించినట్లు వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే, డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 19 మందికి రూ.21,500 జరిమానా విధించినట్లు వివరించారు.

గుర్రపు డెక్క తొలగింపు



కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ వడ్డెపల్లి చెరువులోని నాచుతో పాటు తుంగగడ్డి, గుర్రపు డెక్కను మత్స్య కార్మికులు తొలగించారు. చేపల పెంపకంతో పాటు వాటిని పట్టుకోవడానికి ఇబ్బందులు ఎదురవుతున్న క్రమంలో మత్స్యకారులు చందాలు వేసుకుని ప్రొక్లెయినర్ సహాయంతో చెరువును శుభ్రం చేశారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మట్టెపల్లి నర్సింగం, మట్టెపల్లి శంకర్, రామ కోటేశ్వర్లు పనులను పర్యవేక్షించారు.

మహిళలకు తీపి కబురు

- పాడి, కోళ్ల పరిశ్రమల ఏర్పాటు
- జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా ఏర్పాట్లు
- బ్యాంకులు, స్త్రీ నిధి ద్వారా రుణాలు
- నేడు లాంఛనంగా ప్రారంభం

హసన్‌పర్తి: మహిళా సంఘాలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. మహిళలను ఆర్థికంగా మరింత బలోపేతం చేసేందుకు స్వయం సహాయ సంఘాలకు కోళ్ల ఫారాలు, పాడి పశువుల పెంపక కేంద్రాలు ఏర్పాటు చేయనుంది. మహిళలు ఆయా యూనిట్లు నిర్వహించేందుకు బ్యాంకులు, స్త్రీ నిధి రుణాల ద్వారా ఆర్థిక సాయం అందించనుంది. అర్హులైన వారిని ఈ యూనిట్ల కోసం ఎంపిక చేయాలని సర్కారు ఆదేశాలు జారీ చేసింది.

మండలానికి యూనిట్ చొప్పున..

కోళ్ల పరిశ్రమ కోసం ప్రతి మండలానికి ఒక్కటి చొప్పున యూనిట్లను అధికారులు మంజూరు చేయనున్నారు. ప్రతి యూనిట్‌కు రూ.2.91 లక్షలు రుణం మంజూరు చేస్తారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద రూ.లక్ష వ్యయంతో షెడ్‌లు ఏర్పాటు చేయనున్నారు. అయితే సదరు రైతు సొంత స్థలం కలిగి ఉండాలి. నాటు కోళ్ల పెంపకం యూనిట్లను ఒక్కో జిల్లాలో రెండు వేల మందికి మంజూరు చేయనున్నారు.

నేడు పరిశ్రమల ప్రారంభం

ఈనెల 26న కోళ్లు, పాడి పరిశ్రమలను ప్రారంభించనున్నారు. ప్రతి మండలంలో యూనిట్లు ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే అర్హుల నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

మండలానికి పది పాడి యూనిట్లు

మండలానికి 10 నుంచి 15 చొప్పున పాడి పరిశ్రమల యూనిట్లు మంజూరు చేయనున్నారు. అందుకు స్త్రీ నిధి, బ్యాంకుల ద్వారా రుణాలు అందించనున్నారు. సదరు రైతు నాలుగు నుంచి ఐదు వరకు పాడి పశువులు కలిగి ఉండాలి. జాతీయ ఉపాధి హామీ పథకం కింద రూ.70వేలు మంజూరు చేయనున్నారు. ఈ నిధులతో షెడ్‌లు ఏర్పాటు చేయనున్నారు. అయితే రైతులు తప్పనిసరిగా సొంత స్థలం కలిగి ఉండాలని ప్రభుత్వం మార్గదర్శకాలు రూపొందించింది.



యూనిట్లు ఎంపిక చేశాం..



పాడి పరిశ్రమ, కోళ్ల పరిశ్రమలుకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి యూనిట్లు మంజూరు చేశాం. మంగళవారం అర్వపల్లి, అన్నాసాగరం గ్రామాల్లో పాడి పరిశ్రమల యూనిట్, సిద్దాపురంలో కోళ్ల పరిశ్రమ కోసం షెడ్‌ల నిర్మాణం చేపడుతాం.

– విజయలక్ష్మి, ఏపీఓ, ఈజీఎస్

పత్తికి మద్దతు ధర చెల్లించాలి

కాశిబుగ్గ: పత్తికి మద్దతు ధర చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్ డిమాండ్ చేశారు. ఏసీరెడ్డినగర్‌లోని సీపీఎం కార్యాలయంలో తెలంగాణ పత్తి రైతుల రాష్ట్ర సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో పత్తిసాగు విస్తీర్ణం క్రమంగా తగ్గుతోందన్నారు. గత సంవత్సరం 44.52 లక్షల ఎకరాల్లో సాగు చేయగా, ఈ ఏడాది 43.76 లక్షల ఎకరాల్లో పత్తి సాగైనట్లు వివరించారు. పత్తి సాగు ఖర్చు ఏటేటా పెరుగుతుండగా ఆదాయం మాత్రం తగ్గుతోందని వాపోయారు. పత్తికి మద్దతు ధరలేక రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈక్రమంలో పత్తిసాగు ఆర్థికాంశాలపై రాష్ట్రం ప్రభుత్వం లోతుగా పరిశీలించి రైతుల ఆదాయం పెంచే మార్గాలను సూచించాలని కోరారు. సదస్సులో రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి శోభన్, బొంతు రాంబాబు, మాదినేని రమేష్, మార్తినేని పాపారావు, భూక్య చందునాయక్, చల్ల నరసింహారెడ్డి, వీరాచారి, నరసింహచారి, పుచ్చకాయల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సాగర్

పార్ట్‌టైం లెక్చరర్ల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో పాల్గొన్న కార్యవర్గ ప్రతినిధులు

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న పార్ట్‌టైం లెక్చరర్ల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్రస్థాయి పార్ట్‌టైం అధ్యాపకుల అసోసియేషన్ (టీజీఅప్టా) కార్యవర్గ ప్రతినిధులు డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీలోని ఎస్‌డీఎల్‌సీఈ జాఫర్ నిజాం సెమినార్ హాల్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ పార్ట్‌టైం లెక్చరర్లకు ఇస్తామన్న కన్సాలిడేటెడ్ పేమెంట్ లేదా మినిమం టైంస్కేల్‌ను ప్రభుత్వం ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో 800 మంది పార్ట్‌టైం లెక్చరర్లు పనిచేస్తున్నారని వివరించారు. సమావేశంలో ఆల్ యూనివర్సిటీస్ పార్ట్‌టైం అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సోల్తి కిరణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎర్రం నాగేంద్రం, ఉపాధ్యక్షుడు డాక్టర్ కుమారస్వామి, డాక్టర్ కంచి రాజేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీలక్ష్మి, మంచాల లింగస్వామి, డాక్టర్ శ్యాంసుందర్, డాక్టర్ విజయ్‌కుమార్, లక్ష్మణ్, కుమారస్వామి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్టంట్ పరీక్షలు నిర్వహించాలని ధర్నా

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం, పీజీ, ఇతర వృత్తివిద్యా కోర్సుల్లో అన్ని సబ్జెక్టుల్లో ఉత్తీర్ణత సాధించి ఫైనల్ ఇయర్‌లో ఒక సబ్జెక్టులో ఫెయిల్ అయిన విద్యార్థులకు ఇన్‌స్టంట్ పరీక్షలు నిర్వహించాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు క్యాంపస్‌లోని పరిపాలన భవనం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహారావు, బాధ్యులు పృథ్వీ, వెంకటేష్, కావ్య, అనూష, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

హయగ్రీవాచారికి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ, నాయకులు

హన్మకొండ చౌరస్తా: మాజీ మంత్రి హయగ్రీవాచారి జయంతి సందర్భంగా హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల జంక్షన్‌లోని ఆయన విగ్రహానికి పలువురు కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి సోమవారం నివాళులర్పించారు. పేదల సంక్షేమం కోసం ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఏఐసీసీ సభ్యుడు బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ తోట వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు సుధాకర్, శ్రీనాథ్, రాజేందర్, రంగనాథ్, సునీల్, రమాదేవి, సునీత, పల్లవి, యాదగిరి, రఫీ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి

హసన్‌పర్తి: ఆర్థికంగా వెనుకబడిన ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి చేస్తానని ఆ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ అన్నారు. ఆర్యవైశ్య సంఘం మహాసభ హనుమకొండ జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం చింతగట్టు క్యాంపు సమీపంలోని ఎంటీఆర్ గార్డెన్‌లో సోమవారం జరిగింది. ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి వంగేటి అశోక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ హక్కుల సాధన కోసం ఆర్యవైశ్యులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అనంతరం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు తోట సురేష్, ప్రధాన కార్యదర్శి దొడ్డ మోహన్‌రావు, కోశాధికారి శ్రీరామ్ రవీందర్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు పడకంటి జ్యోతి, ప్రధాన కార్యదర్శి దొడ్డ దేవి, కోశాధికారి పద్మజాతో ప్రమాణ స్వీకారం చేయించారు. అలాగే, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు అడ్డగూడి సతీష్, ప్రధాన కార్యదర్శి సూర్యదేవర శ్రవణ్‌కుమార్, కోశాధికారి యాంసాని వెంకటేష్ ప్రమాణ స్వీకారం చేశారు.



ప్రమాణ స్వీకారం చేయిస్తున్న లక్ష్మీనారాయణ

ప్రభుత్వ విప్ శ్రీనివాస్‌ను కలిసిన చాంబర్ ప్రతినిధులు



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న చాంబర్ ప్రతినిధులు

వరంగల్: వరంగల్‌కు వచ్చిన వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను తెలంగాణ రాష్ట్ర కాటన్ అసోసియేషన్ అధ్యక్షుడు, వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా పత్తి రైతులు, వ్యాపారస్తులు, పరిశ్రమలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయనకు వివరించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని రవీందర్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో వరంగల్ చాంబర్ ప్రధాన కార్యదర్శి మడురి వేదప్రకాష్, మాజీ అధ్యక్షుడు కటకం పెంటయ్య, కాటన్ సెక్షన్ అధ్యక్షుడు చింతలపల్లి వీరారావు, చాబర్ సలహాదారు పుప్పాల యుగంధర్ పాల్గొన్నారు.

మెట్టుగుట్టపై మహా రుద్రహోమం

మడికొండ: రైల్వే జేఏసీ ఆధ్వర్యంలో మడికొండలోని మెట్టు రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం మహా రుద్రాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ రైల్వే జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్, వైస్ చైర్మన్ కొండ్ర నర్సింగరావు, వైస్ చైర్మన్లు గుర్రపు సుధాకర్‌రావు, రమేష్, ఎస్.రాజేశ్వర్‌రావు, రవీందర్, ఎంకే.మూర్తి, శివ, మాధవరావు, శ్రీనివాస్, నగేష్, భాస్కర్, సంపత్, అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, సత్యనారాయణ శర్మ, విష్ణువర్ధన చార్యులు, చైర్మన్ పైడిపాల రఘుచందర్, తదితరులు పాల్గొన్నారు.

ఫైర్ సేఫ్టీపై అవగాహన

కేయూ క్యాంపస్: హనుమకొండలోని సుబేదారిలోని మహిళా పీజీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఫైర్‌సేఫ్టీపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హనుమకొండ అగ్నిమాపక అధికారి చంద్రశేఖర్, సిబ్బంది అగ్నిమాపక భద్రతపై ప్రదర్శన నిర్వహించారు. ప్రిన్సిపాల్ మధుశ్రీ, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ కవిత, అధ్యాపకులు పాల్గొన్నారు.

అమ్మవారి సన్నిధిలో సినీనటి కవిత



హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయాన్ని సినీనటి కవిత సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమెను ఈఓ శేషభారతి, అర్చకులు స్వాగతించారు. ముందుగా ఆదిశంకరులు, వల్లభ గణపతిని కవిత దర్శించుకుని అనంతరం భద్రకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమెకు అర్చకులు తీర్థ ప్రసాదాలు, అమ్మవారి శేషవస్త్రాలు అందజేసి మహాదాశీర్వచనం చేశారు.

సంక్షిప్తంగా

కలెక్టర్‌ను కలిసిన టీజీఓస్ నాయకులు

హన్మకొండ అర్బన్: తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టీజీఓస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ ఎన్నమనేని జగన్ మోహన్‌రావు ఆధ్వర్యంలో ఇటీవల ఎన్నికైన సంఘం హనుమకొండ జిల్లా నూతన కార్యవర్గ సభ్యులు హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్యను సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. టీజీవోస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మురళీధర్ రెడ్డి, డాక్టర్ ప్రవీణ్ కుమార్, వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, అన్వర్ హుస్సేన్, శ్రీనివాస్ రెడ్డి, ఆంజనేయులు, చంద్రశేఖర్, రఘుపతి రెడ్డి, డాక్టర్ మహేష్ కుమార్, మాధవరెడ్డి, సంతోష్, రవిప్రసాద్, శ్రీనివాసరావు, భాగ్యలక్ష్మి, వాసం శ్రీనివాస్, నాగరాజు, శివాజీ, డాక్టర్ విక్రమ్, వినోద్‌కుమార్, రమేష్ కుమార్, వినయ్, కృష్ణవేణి పాల్గొన్నారు.

కేయూలో రేపు జాతీయ సదస్సు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని పొలిటికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 27న జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు కేయూ ఎస్‌డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ రాంచంద్రం, ఆ విభాగం అధిపతి డాక్టర్ సంకినేని వెంకట్ తెలిపారు. ఈమేరకు పొలిటికల్ సైన్స్ విభాగంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఆకాంక్షలు, వాగ్దానాలు, రాజకీయ పనితీరు అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఆ విభాగం అధ్యాపకులు కృష్ణయ్య, సత్యనారాయణ, నాగరాజు, పరిశోధకులు అంకెళ్ల శంకర్, ప్రసాద్, రూబినా, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో ఎన్‌సీసీ ర్యాలీ

కేయూ క్యాంపస్: భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన నవంబర్ 26ను పురస్కరించుకుని హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో 10వ బెటాలియన్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో రాజ్యాంగ అవగాహన ర్యాలీని కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు సోమవారం నిర్వహించారు. ఈ ర్యాలీలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుల్లా రమేష్, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ డాక్టర్ స్వామి, ఫ్లయింగ్ ఆఫీసర్ డాక్టర్ బి.ప్రసాద్, కేర్‌టేకర్ నహీదఫర్వీన్, గిరి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఖిలా వరంగల్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలని మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం సూచించారు. ఈమేరకు వరంగల్ చింతల్ బ్రిడ్జి వద్ద ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి వాహన తనిఖీలు చేపట్టారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని ఐదు వాహనాలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వాహన చోదకులకు ట్రాఫిక్ రూల్స్, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించి, కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ వాహన పత్రాలు లేకుండా వాహనాన్ని రోడ్డుపై నడిపితే కేసులు నమోదు చేసి సదరు వాహనాన్ని సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఏకాగ్రతతో వాహనాన్ని నడపాలని, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ నడిపితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు.

ఫార్మసీకి మంచి డిమాండ్

హసన్‌పర్తి: ప్రస్తుతం మార్కెట్‌లో ఫార్మసీకి అధిక డిమాండ్ ఉందని ఎస్‌వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు అన్నారు. భీమారంలోని ఎస్‌వీఎస్ కళాశాలలో బీ ఫార్మసీ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందిన విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రాంను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాశ్చాత్య దేశాల్లో వైద్యులు కేవలం వ్యాధిని నిర్ధారిస్తే.. ఫార్మసిస్టులు మెడిసన్ ఇస్తారని తెలిపారు. కళాశాలలో ప్రవేశం పొందిన నిరుపేద విద్యార్థులకు చేయూతనిస్తామని భరోసా ఇచ్చారు.

మాదిగ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలంలోని వివిధ పత్రికల్లో పనిచేస్తున్న మాదిగ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఆ సంఘం నాయకులు కోరారు. ఈమేరకు గ్రీవెన్స్‌లో కలెక్టర్ ప్రావీణ్యకు సోమవారం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మాదిగ జర్నలిస్ట్ ఫోరం హసన్‌పర్తి మండల అధ్యక్షుడు సందెల రాజు, ప్రధాన కార్యదర్శి రామంచ మధుకర్, గౌరవ అధ్యక్షుడు సింగారపు బాబు, జర్నలిస్టులు రాజారపు భిక్షపతి, రేనుకుంట్ల దుర్గాప్రసాద్, శ్రీకాంత్, పోగుల రాజ్‌కుమార్, స్వామి, బొక్క రాజు, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

మన్నా చర్చిలో రక్తదానం

కాశిబుగ్గ: నగరంలోని మన్నా చర్చిలో సోమవారం రక్తదానం చేశారు. పాస్టర్ రవికుమార్ జ్ఞాపకార్థం ఆయన పేరు మీద పాస్టర్ జి.రవికుమార్ ఫౌండేషన్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు ప్రారంభించినట్లు నిర్వాహకురాలు సుభాషిణి జ్యోతి తెలిపారు. అందులో భాగంగా నగరంలోని మన్నా చర్చిలో సోమవారం రక్తదానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్ ఎలీషా మనీషా, హ్యారీ శిరిష, చెరుకు యాకోబ్, మేదరి ప్రదీప్ పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహాలకు జలాభిషేకం

ఖిలా వరంగల్: వేద పండితుడు పాలకుర్తి సుబ్రమణ్యం శర్మ ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఇనుమల మల్లేశం నేతృత్వంలో విగ్రహాల ప్రతిష్ఠాపన పూజలు, అభిషేకాలు, కుంకుమార్చన నిర్వహించారు. గ్రామదేవతులైన శ్రీభూలక్ష్మి, శ్రీలక్ష్మి విగ్రహాలపై నీళ్లతో జలాధివాసం జరిపించారు.

కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడికి పరామర్శ



హసన్‌పర్తి: కిసాన్ కాంగ్రెస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పింగిలి వెంకట్రామ్ నర్సింహారెడ్డి తల్లి సౌదామిని సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, టెస్కాబ్ రాష్ట్ర అధ్యక్షుడు మార్నేని రవీందర్, కుడా చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి, బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, పీఏసీఎస్ చైర్మన్ ఉదయ్‌రెడ్డి పరామర్శించారు.

'ప్రీ రిపబ్లిక్ డే పరేడ్' కేడెట్లకు అభినందన

కేయూ క్యాంపస్: మహారాష్ట్ర లోజల్గాంలోని కేబీసీ నార్త్ మహారాష్ట్ర యూనివర్సిటీలో ఈనెల 12నుంచి 21వ తేదీ వరకు కాకతీయ యూనివర్సిటీ జాతీయ సేవాపథకం (ఎన్‌ఎస్‌ఎస్) వలంటీర్లు ప్రీరిపబ్లిక్ డే పరేడ్‌ను విజయవంతంగా పూర్తిచేసుకొని వచ్చారు. యూనివర్సిటీలో వారిని వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ఈసం నారాయణ సోమవారం అభినందించారు. క్యాంపులో పాల్గొన్న హనుమకొండ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థి వెంకన్న, వాగ్దేవి డిగ్రీ కళాశాలకు చెందిన రామచరణ్, వరంగల్ ఎల్‌బీ కళాశాల విద్యార్థి బానోతు దివ్య, కేయూ మహిళా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి అంజలి, నేలకొండపెల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి కొన్నేటి నాగరాజును సన్మానించారు.

శివాలయాల్లో కార్తీక సోమవారం పూజలు



మెట్టుగుట్టపై ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



కాజీపేట రూరల్: రైల్వే ఆలయంలో గోమాతకు పూజ చేస్తున్న భక్తులు, అర్చకులు



వరంగల్ స్టేషన్ రోడ్డులోని కాశీవిశ్వేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



ఖిలా వరంగల్: మధ్యకోటలో శంభులింగేశ్వర స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

కార్తీకమాసం ఆఖరి సోమవారాన్ని పురస్కరించుకుని కాశిబుగ్గలోని కాశీ విశ్వేశ్వరాలయం, లేబర్ కాలనీలోని పంచముఖ నాగ వీరేశ్వరాలయం, కాశిబుగ్గ ఓసిటీ రోడ్డులోని సీతారామాంజనేయ సహిత ఓంకారేశ్వస్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మడికొండలోని మెట్టు రామలింగేశ్వర స్వామి ఆలయంలో గోపూజ, అఖండ దీపారాధన, ప్రాతఃకాల మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. రామాలయంలో స్వామివారికి విశేష అర్చనలు చేశారు. కాజీపేట రైల్వే దేవాలయ సముదాయంలోని భవానీశంకర్ ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, గోదావరి నది జలాభిషేకం, అన్నాభిషేకం, గణపతి, రుద్రహోమం నిర్వహించారు. వరంగల్ స్టేషన్ రోడ్డులోని ఆకారపు కాశీవిశ్వేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యకోటలోని స్వయంభూ శంభులింగేశ్వర స్వామికి సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి.

– సాక్షి నెట్‌వర్క్

పట్టా పాస్ పుస్తకాలు జారీచేయండి

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం భీమారం శివారులో దళితులకు పంపిణీ చేసిన భూములకు పట్టా పాస్ పుస్తకాలు జారీ చేయాలని బాధితులు కోరారు. ఈమేరకు హసన్‌పర్తి తహసీల్దార్ చల్లా ప్రసాద్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 40 ఏళ్ల క్రితం భీమారం శివారులోని 340, 340/66, 354 సర్వే నంబర్లలోని 70 ఎకరాల భూమిని అర్హులైన దళితులకు ఒక్కొక్కరికి 15 గుంటల చొప్పున పంపిణీ చేశారు. అయితే పదేళ్ల క్రితం నిర్మించిన జాతీయ రహదారిలో కొంతమంది లబ్ధిదారులు తమ భూములు కోల్పోయారని తెలిపారు. మిగిలి ఉన్న భూమిని స్టేడియం నిర్మాణానికి తీసుకుంటున్నట్లు ఏడేళ్ల క్రితం నోటీసులు జారీ చేశారని వివరించారు. కార్యక్రమంలో గ్రామీణ పేదల సంఘం అధ్యక్షుడు ఇల్లందుల శోభన్‌బాబు, జిల్లా కార్యదర్శి సిరిపెల్లి రాజయ్య సంఘాల కోటేశ్వర్, సంగాల పరమేష్, సంగాల పాల్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

కనీస సదుపాయాలు కల్పించాలి



ధర్నా చేస్తున్న భగత్‌సింగ్ నగర్ వాసులు

వరంగల్ అర్బన్: కనీస సదుపాయాలు కల్పించాలని నగరంలోని 2వ డివిజన్ భగత్‌సింగ్ నగర్ వాసులు డిమాండ్ చేశారు. ఈమేరకు సీసీ రోడ్లు, నల్లా కనెక్షన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం హనుమకొండ జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి మాట్లాడుతూ 20ఏళ్లకు పైగా నివాసముంటున్న భగత్‌సింగ్‌నగర్‌ను పట్టించుకునే వారు కరువయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల పార్టీ నాయకులు మంద మల్లేశం, ఒంటెల పాపయ్య, అమృత్, కళావతి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

వరంగల్: నేరాలు, అఘాయిత్యాలు పెరుగుతున్న నేటి కాలంలో నేరాల అదుపులో అందరు భాగస్వాములు కావాలని వరంగల్ షీటీమ్ హెడ్ కానిస్టేబుల్ సీహెచ్.యాదగిరి సూచించారు. వరంగల్ కాశిబుగ్గలోని శ్రీచైతన్య హైస్కూల్‌లో విద్యార్థినులకు సైబర్ నేరాలు, మహిళలపై జరిగే అత్యాచారాలు, అఘాయిత్యాల నియంత్రణపై సోమవారం అవగాహన కల్పించారు. సోషల్ మీడియాలో విద్యార్థినులు తమ వ్యక్తిగత ఫొటోలు, వివరాలు పంచుకోవడంలో జాగ్రత్త వహించాలని చెప్పారు. టీ- సేఫ్ యాప్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. సైబర్ నేరాలు జరిగితే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు.